# సాక్షి
## తూర్పుగోదావరి

ఆదివారం । 3 । నవంబర్ । 2024




### ఉపాధికి రైట్ రైట్

8లో


ప్రయాణికులను గమ్యస్థానాలకు తీసుకువెళ్లడంతో పాటు, యువతకు డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడంలోనూ ఏపీ రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఏపీఎస్ ఆర్టీసీ) ముందుంటోంది.



### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి అన్నవరానికి చెందిన వీర్ల సత్యసాయి తేజ రూ.లక్ష విరాళంగా సమర్పించారు. ఈ మేరకు చెక్కును ఈఓ రామచంద్రమోహన్‌కు అందచేశారు.

### 32 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 32,861 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 8,300 క్యూసెక్కుల నీరు వదిలారు.

## న్యూస్‌రీల్

### ఈ-స్టాంపింగ్ విధానానికి ఇక సెలవు!

- నాన్ జ్యుడీషియల్ స్టాంపులకు పచ్చజెండా
- అక్రమార్కులకు ఊతమిచ్చేలా సర్కారు యోచన



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేరిన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు

రాజమహేంద్రవరం రూరల్: ఈ–స్టాంపింగ్ విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి చెప్పనుంది. వాటి స్థానంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులను అందుబాటులోకి తీసుకువచ్చింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రక్షాళనకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నడుం బిగించింది. ఆ శాఖలో మ్యానువల్ విధానానికి స్వస్తి పలికి దశల వారీగా ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. అందులో భాగంగా కార్డ్‌ప్రైమ్ 2.0 అనే సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి రిజిస్ట్రేషన్లను సులభతరం చేసింది. ఆస్తుల క్రయ విక్రయాలలో జాప్యానికి తావు లేకుండా పాత తేదీలతో మోసాలు జరగకుండా, సత్వరం డాక్యుమెంట్లు వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకుంది.

తాజాగా కూటమి ప్రభుత్వం పాత పద్ధతిలోనే నాన్ జ్యుడీషియల్ స్టాంపులను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఇదే జరిగితే మళ్లీ అక్రమ లావాదేవీలకు తెరతీసినట్టేనని క్రయ, విక్రయదారులు అభిప్రాయపడుతున్నారు. కాగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఐజీ ఆదేశాల మేరకు నాన్ జ్యుడీషియల్ స్టాంపులను ప్రవేశపెడుతున్నట్టు జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రూ.10, రూ.20, రూ.50 స్టాంపులను ఇప్పటికే పంపించామని, రూ.100 స్టాంపులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతానికి ఈ స్టాంపింగ్ విధానంలో కొనుగోలు చేసుకోవచ్చునంటూనే, దాన్ని కొనసాగిస్తారా, రద్దు చేస్తారా అనే విషయమై ఎటువంటి ఆదేశాలు రాలేదని పేర్కొన్నారు.

### అప్పనపల్లిలో భక్తజన కోలాహలం



స్వామివారి అన్న ప్రసాదం కోసం బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. కార్తిక మాసంలోని మొదటి రోజు కావడంతో పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. కొత్త గుడిలోని ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించారు. పాత గుడిలో అభిషేకాలు చేయించుకున్నారు. స్వామి వారికి ముడుపులు, మొక్కుబడులు, తల నీలాలు సమర్పించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2,53,765 ఆదాయం లభించింది. 5,540 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా 3,386 మంది అన్న ప్రసాదం స్వీకరించారు.

### సత్యదేవుని ప్రసాదంలో కల్తీలేదు



సత్యదేవుని ప్రసాదం తయారు చేస్తున్న సిబ్బంది

అన్నవరం: సత్యదేవుని ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యి, గోధుమలు, పంచదారలో కానీ, అన్న ప్రసాదానికి వినియోగించే దినుసుల్లో కానీ ఎటువంటి కల్తీ లేదని ఈవో కె.రామచంద్రమోహన్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇక్కడి నమూనాలను పరీక్షించారని వివరించారు. అన్నదానంలోని సాంబార్‌లో ఉపయోగించే బెల్లంలో మాత్రం కొంచం పంచదార కలవడంతో తీపి తగ్గిందని అధికారులు చెప్పిన విషయాన్ని కలెక్టర్‌కు నివేదించినట్టు ఈఓ తెలిపారు. అలాగే వ్రత మంటపాలకు ఎదురుగా రూ.40 లక్షలతో నిర్మించిన స్టెయిన్‌లెస్ స్టీల్ క్యూ లైన్‌ను ఆదివారం ప్రారంభించనున్నట్టు ఈఓ తెలిపారు.

# పంచాక్షరితో పుడమి పునీతం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా కార్తిక శోభను సంతరించుకుంది. వేకువ జామునే నదీతీరాల్లో స్నానాలు.. దీపారాధనలతో సర్వత్రా భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. శనివారం జిల్లా వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాజమహేంద్రవరం గోదారి తీరం శివ పంచాక్షరితో పునీతమైంది. ఉమా మార్కండేయేశ్వర స్వామివారి ఆలయం, అతి పురాతన కాశీ అన్నపూర్ణేశ్వరీ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయం, కొవ్వూరు గోష్పాద క్షేత్రాలలో విశేష అభిషేకాలు, రుద్ర హోమాలు చేయగా, పుష్కరాల రేవు, కోటిలింగాల రేవు తదితర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో భక్తులు పుణ్య స్నానాలు చేశారు.



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో భక్తుల దీపారాధన



పుష్కర ఘాట్‌లో దీపాన్ని వదులుతున్న భక్తురాలు



రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో భక్తజన సందోహం

# స్వరరాగ సంజీవిని

- మ్యూజిక్ థెరపీతో రోగాలకు చెక్
- గ్రహ రాశులతో రాగానుబంధం
- శారీరక, మానసిక క్లేశాలకు దివ్యౌషధం
- నేటి సాయంత్రం 5 గంటలకు ఆనం కళాకేంద్రంలో సెమినార్



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శిశుర్వేత్తి పశుర్వేత్తి.. వేత్తి గానరసం ఫణిః అన్నారు పెద్దలు. అంటే శిశువులు, పశువులు, పాములు కూడా గానానికి పరవశమవుతాయి. అదే విధంగా కృష్ణుని వేణుగానానికి గోవులు, గోపికలు కూడా మంత్ర ముగ్ధులయ్యేవారని భారత, భాగవత తదితర పురాణాల ద్వారా తెలుసుకున్నాం. ఇంత శక్తి ఉంది కాబట్టే సంగీతానికి భాషతో పనిలేదంటారు. జో అచ్యుతానంద జోజో ముకుందా.. లాలి పరమానంద అని పాడుతూ చంటి పిల్లలను ఒక చెత్తో జోకొడుతూ నిద్రపుచ్చుతారు. తల్లి గాత్రానికి ఆ చిన్నారి మనసు తనువు అలవాటు పడి ఓ అనిర్వచనీయమైన అనుభూతికి లోనై పిల్లవాడు నిద్రలోకి జారుకుంటాడు. ఇక్కడ రెండు క్రియలు ఒకేసారి జరుగుతున్నాయి. ఒకటి శ్రుతి శుభగంగా పాడటం, మరొకటి లయబద్ధంగా చిన్నారిపై జోకొట్టడం. వీటి వల్ల పిల్లవాడు నిద్రలోకి జారుకుంటున్నాడు అని పరిశోధకులు చెబుతున్న మాట. మనిషి పుట్టినప్పటి నుంచి చివరి శ్వాస వరకు ఎన్నో రోగాలతో బాధపడుతుంటాడు. బీపీ, సుగర్, తలనొప్పి, దీర్ఘకాలిక వ్యాధుల వంటి సమస్యలతో సతమతం అవుతుంటారు. వీటిన్నటినీ మ్యూజిక్ థెరపీ ద్వారా తగ్గించవచ్చని కొంత మందికి మాత్రమే తెలుసు. ఈ ప్రక్రియకు సంబంధించి శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సెమినార్ నిర్వహిస్తున్నారు.

**ఒత్తిడి వల్ల ఆత్మహత్యలు..**

నేటి తరం యువత అన్ని రంగాలలో ముందుండాలని పరుగుతీస్తున్నారు. విద్యార్థులు ర్యాంకుల వెనుక పరుగిడుతుంటే.. యువత ఏదో సాధించాలని, ఉద్యోగంలోనో.. బిజినెస్‌లోనో.. ప్రొఫెషన్‌లోనో.. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలని ఆరాటం.. అమ్మాయి వివాహం కోసం ఆమె తండ్రి.. కాదు జీవితంలో స్థిరపడాలని ఉద్యోగం కోసం ఆమె.. ఆ తండ్రీ తనయల మధ్య మానసిక సంఘర్షణ.. తీరా పెళ్లయితే ఓ నలుసుని మా మొహాన పడెయ్యచ్చు కదా అని తల పండిన తాతమ్మలు.. అమ్మమ్మలు.. ఇలా జీవన గమనంలో ప్రతి వయసులోనూ మనిషి ఏదో ఒక ఆలోచనతో.. ఆరాటంతో వాటిని సాధించాలని వాటి వెనుక అవిశ్రాంతంగా పరుగులు పెడుతూనే ఉన్నారు. దీని వల్ల వారిలో మానసిక ఒత్తిడి రోజు రోజుకు పెరిగిపోతోంది. అనుకున్నది సాధించిన వారు ఇంకో లక్ష్యాన్ని ఎంచుకుని మరో పోరాటానికి సిద్ధమవుతుంటే.. సాధించలేక అలసి సొలసినవారు ఏకంగా నేను బతికుండడమే వేస్ట్ అనుకుంటూ ప్రాణ త్యాగానికి ఒడిగడుతున్నారు. కొన్ని కార్పొరేట్ కాలేజీలలో విద్యార్థులు ఒత్తిడి తట్టుకోలేక కాలేజీ కాంపౌండ్‌పై నుంచి దూకి ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు.. లక్ష్య సాధనలో విఫలమై పలు విధాల ప్రాణాలు తీసుకుంటున్న కథనాలు నిత్యం వార్తాపత్రికల్లో చూస్తూనే ఉన్నాం. అటువంటి వారికి సాంత్వన చేకూర్చి సమస్య పరిష్కారానికి చక్కని మార్గాన్ని సూచించేలా మ్యూజిక్ థెరపీ పనిచేస్తుందని ఆ విధానంలో ప్రజ్ఞ సాధించిన వారు చెప్తున్నారు. సంగీతం వినడం ద్వారా ఆందోళన, ఒత్తిడి స్థాయి భావాలు క్రమేణా సాధారణ స్థాయికి వస్తాయి. సమస్య ఎదురైనపుడు నచ్చచెప్పేవారు లేక.. వారు చెప్పుకోడానికి ఓ మనిషి లేక వారిలో వారే మధనపడి తీసుకునే కఠిన నిర్ణయాలు చాలా తీవ్రంగా ఉంటున్నాయి. పాశ్చాత్య దేశాలలో పిల్లలకు చిన్నప్పటి నుంచే మ్యూజిక్‌ను అదనంగా నేర్చుకునే వీలు కల్పిస్తున్నారు. ప్రాచీన భారతీయులు చిన్నప్పుడు గురుకులానికి వెళ్లి సంగీతంతో సహా సకల విద్యలలో ప్రావీణ్యం సంపాదించేవారు. కాని నేడు ఆ వ్యవస్థ పోయి రాత్రి పగలు తేడా లేకుండా వారి లక్ష్య సాధన వెంట పరుగులు తీస్తున్నారు.

**12 రాశులు... 12 స్వరాలు...**

ప్రణవం నుంచి ఓంకారం పుట్టింది. అలాగే ప్రకృతి నుంచి షడ్యమాది నిషాద స్వరాలు పుట్టాయంటారు. ఈ స్వరాలకు మేషాది మీన రాశులకు ఓ అనుసంధానం ఉందని, ఆయా రాశులలో జన్మించిన మనుషులు ఆయా రాశికి అనుసంధానమైన స్వరానికి త్వరగా స్పందిస్తారని మేధావులు అంటున్నారు. జాతక రీత్యా ఆయా రాశులు వారు వారి రాశి ప్రకారం పేర్లు పెట్టుకోవడం అనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. అలాగే నెమలి కూత షడ్జమం 'స' గానూ, వృషభ ధ్వని రిషభాన్ని 'రి'గానూ, , మేకపోతు అరుపు గాంధారం 'గ' గానూ, క్రౌంచిక పక్షి కూతను మధ్యమం 'మ' గానూ, కోకిల కూత పంచమాన్ని 'ప' గానూ, గుర్రపు సకిలింపు దైవతాన్ని 'ద' గానూ, ఏనుగు ఘీంకారం 'ని'గానూ వెరసి సరిగమ పదని సప్త స్వరాలు ఏర్పాడ్డాయి.

### ఆస్ట్రో సౌండ్ థెరపీతో వ్యాధులకు చెక్



ఇప్పటి వరకు సంగీతంతో కొన్ని రోగాలను తగ్గించవచ్చని పరిశోధకులు చెబుతున్న మాట. ఇకపై వారి గ్రహస్థితితో పాటు వారి రాశులకు సరిపడే స్వరాలతో థెరపీ చేయిస్తే మరింత ఉత్తమ ఫలితాలను పొందవచ్చు. మలేషియా లోని మలయేస్ యూనివర్సిటీలో ఈ అంశంపై పరిశోధన చేసి థీసిస్‌ను వారికి అందచేశాను. ప్రాక్టికల్‌గా వారికి చూపిండం జరిగింది. దీనిపై నాకు పీహెచ్‌డీ రానుంది. ఇదే విషయాన్ని మనవారికి కూడా తెలియాలని ఈ సెమినార్ ఏర్పాటు చేశాం

– జీఎల్ దీపిక, మ్యూజిక్ థెరపిస్ట్

### ఉచిత ప్రవేశం



ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఆస్ట్రో సౌండ్ థెరపీపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. ఉచితంగానే ఈ సెమినార్ ను చూడవచ్చు. మనలో చాలా మందికి సంగీతం ఒక వర్గం వారూ మాత్రమే నేర్చుకుంటారని అనుకుంటారు. సంగీతం ఏ ఒక్కరి సొత్తు కాదు ప్రతి ఒక్కరూ నేర్చుకోవచ్చు. సంగీతం నేర్చుకోకపోయినా వాటిని శ్రావ్యంగా వింటే చాలు చక్కటి అనుభూతి కలుగుతుంది.

– డాక్టర్ జీబీ నారాయణ, శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర అధ్యక్షుడు

### రీచ్‌లో తవ్వకాలు ప్రారంభించాలి



పంచాయతీలకు అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ: అనుమతులు ఇచ్చిన రీచ్‌లలో మంగళవారం నాటికి ఇసుక తవ్వకాలు ప్రారంభించాలని కలెక్టర్ పి.ప్రశాంతి బోట్స్‌మన్ సొసైటీలను ఆదేశించారు. శనివారం డీఎల్ఎస్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీ విధానం అమలులో మరిన్ని సంస్కరణలు తీసుకువచ్చినట్టు ఆమె తెలిపారు. రీచ్‌ల నిర్వహణపై ఆది, సోమవారాల్లో ఒక్కో రోజు రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల పరిధిలో శిక్షణ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. చట్టబద్ధమైన విధుల మినహాయింపు నేపథ్యంలో ప్రస్తుతం ఒక మెట్రిక్ టన్ను స్టాక్‌యార్డ్ వద్ద రూ.270 ఉండే ధరను రూ.150 చేయడం జరిగిందన్నారు. డి–సిల్టేషన్ ర్యాంపుల వద్ద రూ.345 ఉన్న ధరను రూ.229కి చేశామన్నారు. ఓపెన్ రీచ్ ఇసుక రూ.220 ఉన్న ఇసుక ధరను రూ.118కి తగ్గించినట్లు తెలిపారు.

**టీబీ పరీక్షలు తప్పనిసరిగా చేయాలి**

జిల్లాలోని పంచాయతీల్లో టీబీ నిర్ధారణ పరీక్షలు తప్పని సరిగ్గా చేయాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలో శ్రీ వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో టీబీ ఫోరం సొసైటీ, టీబీ ముక్త్ గ్రామ పంచాయతీ అవార్డు ప్రదాన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లాలోని 109 పంచాయతీలకు టీబీ ముక్త్ పథకం ద్వారా గాంధీ బ్రాంజ్ మెడల్, సర్టిఫికెట్లు అందించడం ద్వారా వారిపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. రానున్న రోజుల్లో గోల్డెన్ గాంధీ అవార్డు కోసం ముందుకు సాగాలన్నారు.

# పరీక్షలకు వేళాయె..



- రేపటి నుంచి ఎస్ఏ-2 పరీక్షలు
- హాజరు కానున్న 1 నుంచి 10 తరగతుల విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

రాయవరం: విద్యార్థుల విద్యాస్థాయిని తెలుసుకునేందుకు ఏటా నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్, రెండు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా రెండో సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షను సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ రాష్ట్ర విద్యాపరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన ఉమ్మడి పరీక్షా పత్రం ద్వారానే పరీక్షలు రాయనున్నారు. సెల్ఫ్ అసెస్‌మెంట్–2 పరీక్షలు పాత విధానంలో నిర్వహిస్తున్నారు.

**పరీక్షలు జరిగే తీరు**

ఒకటి నుంచి ఐదో తరగతి చదివే విద్యార్థులకు ఉదయం 10 నుంచి 11 వరకూ, మళ్లీ మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 వరకూ పరీక్షలు జరుగుతాయి. ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 వరకూ ఒక పరీక్ష, 2.20 నుంచి 3.20 వరకూ మరో పరీక్ష జరుగుతుంది. ఇక తొమ్మిది, పది తరగతులు విద్యార్థులకు ఉదయం 10 నుంచి 11 వరకూ, మళ్లీ 11.15 నుంచి 12.15 వరకూ నిర్వహిస్తారు. విద్యార్థులకు ముద్రిత ప్రశ్నపత్రాలను సరఫరా చేస్తారు. ఎంఆర్‌సీ కార్యాలయం, కాంప్లెక్స్ కేంద్రాల నుంచి ప్రశ్నపత్రాలను పాఠశాలలకు సరఫరా చేస్తారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు మాత్రమే వీటిని ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా అందజేస్తారు. ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ షెడ్యూల్‌ను అనుసరించి పరీక్షలను నిర్వహించాలి.

### పకడ్బందీగా నిర్వహణ



సెల్ఫ్ అసెస్‌మెంట్ – 2 పరీక్షలను ఉపాధ్యాయులు పకడ్బందీగా నిర్వహించాలి. ప్రతి పేపరుపై జిల్లా కోడ్ ఉంటుంది. ఏ పాఠశాల నుంచి అయినా పేపరు లీక్ అయితే క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకునే వీలుంది. పబ్లిక్ పరీక్షల మాదిరిగానే సెల్ఫ్ అసెస్‌మెంట్–2 పరీక్షలను నిర్వహించాలి.

– షేక్ సలీం బాషా, డీఈఓ, అమలాపురం

### ఏర్పాట్లు పూర్తి



ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా సరఫరా అయిన ప్రశ్నపత్రాలను మండల కేంద్రాలకు పంపించాం. ఎస్ఏ–2 పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్ష జరిగే రోజు మాత్రమే పేపర్లను పాఠశాలలకు సరఫరా చేయనున్నాం. ఎక్కడా ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేని విధంగా పరీక్షలు నిర్వహిస్తున్నాం.

– బి.హనుమంతరావు, సెక్రటరీ, డీసీఈబీ, అమలాపురం

# హత్యలు, అత్యాచారాలపై చర్యలేవీ?

- కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ నేతలు వేణు, రాజా
- బుర్రిలంకలో హత్యాచార బాధితురాలి కుటుంబానికి పరామర్శ
- రూ.1.1 లక్షల ఆర్థిక సాయం అందజేత



మృతురాలి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు చెల్లుబోయిన వేణు, జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి, గూడూరి శ్రీనివాస్, మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు

కడియం: రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలపై చర్యల్లేవని, శాంతిభద్రతలు లేవు, మహిళలకు రక్షణ కరువైందని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. పార్టీ నేత జక్కంపూడి విజయలక్ష్మి, రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డిలతో కలిసి కడియం మండలం బుర్రిలంకలో హత్యాచారానికి గురైన రైతు కస్తూరి కుటుంబాన్ని శనివారం వారు పరామర్శించారు. కస్తూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆమె కుటుంబ సభ్యులకు అండగా ఉంటాని హామీ ఇచ్చారు. అలాగే పార్టీ తరఫున రూ.లక్షా పదివేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి శాంతిభద్రతల మీద భరోసా ఇచ్చే పరిస్థితి లేదని, కూలీనాలీ చేసుకునే మహిళను అత్యంత దారుణంగా హత్యాచారం చేయడం శోచనీయమన్నారు. మృతురాలికి దివ్యాంగురాలైన కుమార్తె ఉందని, ఆమె పరిస్థితి చూస్తుంటే మనసు తరుక్కుపోతోందన్నారు. ఈ కేసులో లోతైన దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వ పెద్దలు ఎందుకు ఇంతవరకు రాలేదని ఆయన నిలదీశారు. మీ కేడర్‌ను వారి అనుయాయులను ప్రేరేపించడం ప్రజాస్వామ్యమా అని నిలదీశారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు పెద్ద ఎత్తున పెరగడమే ఇందుకు కారణంగా తెలుస్తోందన్నారు. ఉత్తరాంధ్ర నుంచి నర్సరీ పనుల కోసం 30, 40 ఏళ్లుగా వచ్చి పనిచేస్తున్న వారికి ఏనాడూ చిన్న సంఘటన జరగలేదని, అయితే ఇప్పుడు ఈ ప్రభుత్వ హయాంలో ఇలా అత్యాచారం , హత్య చోటు చేసుకోవడం దారుణమనివాపోయారు. తల్లి వయసున్న మహిళను చెట్టుకి కట్టేసి, జుట్టు కత్తిరించి, యాసిడ్ పోసి పాశవికంగా అఘాయిత్యానికి పాల్పడ్డారని స్థానికులు చెబుతున్నారన్నారు. కడియం ప్రాంతంలో ఇలాంటి ఘటన మొదటి సారి జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఈ ఘటనలో దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరక్కుండా చూడకపోతే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఉద్యమించి, రోడ్లెక్కుతామని, మహిళలకు అండగా నిలుస్తామన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించకపోతే జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఇక్కడికి వస్తారని పేర్కొన్నారు.

రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎన్నడూ లేని రీతిలో అవాంఛనీయ ఘటన జరగడం చాలా దారుణమన్నారు. మందు, గంజాయి దొరకడం, వీటికి బానిసలైన వాళ్ళు హత్యలు, నేరాలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని, బాధితులను ఆదుకునేలా చూస్తామని ఆయన చెప్పారు.

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ భర్త, కూతురు, కొడుకు ఉన్న తల్లి పట్ల ఇలా దారుణంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. మానసిక దివ్యాంగురాలైన బిడ్డను ఎవరు సాకుతారని ఆమె ఆవేదన చెందారు. మంచి ప్రభుత్వమని డప్పు వాయించుకుంటూ తిరగడం కాదని, మహిళలకు న్యాయం చేయాలని హితవు పలికారు. కనీసం హోమ్ మంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణం బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ 42 ఏళ్ల వయసు గల మహిళపై 19 నుంచి 20 ఏళ్ల వ్యక్తులు అత్యాచారం చేశారంటే ఈ ప్రభుత్వం పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం అవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జరిగిన దారుణాలు అర్ధ సెంచరీ దాటిపోయాయని ఆమె ఎద్దేవా చేశారు. ఈ కుటుంబానికి న్యాయం చేయకపోతే ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గిరిజాల బాబు, నక్కా రాజుబాబు, చెల్లుబోయిన నరేస్, తాడాల విష్ణు చక్రవర్తి, కొత్తపల్లి మూర్తి, తిరుమలశెట్టి శ్రీను, గాద రామకృష్ణ, సాపిరెడ్డి సూరిబాబు, తోరాటి రామకృష్ణ, ఈలి సత్తిబాబు, రత్నం కృష్ణ, ముత్యాల జగదీష్, పంతాల రాంబాబు, ఆకుల సుధాకర్, నాగిరెడ్డి మోహన్, చిలుకూరి రామకృష్ణ, పి.వీర్రాజు, గోవిందు, మద్దాల అను, గాది సాయి, అల్లంపల్లి శ్రీను, జ్యోతుల అర్జున్, రత్నం వెంకన్న, కోడి కోట, బోడపాటి సత్తిబాబు, ఆడపా అనిల్, సలాది ప్రసాద్, భారీ స్థాయిలో మహిళలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

ప్రత్తిపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో అలసత్వం వహించిన 29 మంది సచివాలయ ఉద్యోగులకు శనివారం ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలోని 26 సచివాలయ పరిధిలో 15 సచివాలయాలకు చెందిన ఉద్యోగులకు ఈ నోటీసులు అందాయి. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహించినందుకు నోటీసులు జారీ చేశామని ఎంపీడీఓ తెలిపారు.

### స్క్రీనింగ్ పరీక్ష వాయిదా

కాకినాడ సిటీ: సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఆదివారం జరగాల్సిన ఉచిత మెగా డీఎస్సీ ఎస్సీ, ఎస్టీ స్క్రీనింగ్ పరీక్షను ఈ నెల 10వ తేదీకి మార్పు చేసినట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మార్పును అభ్యర్థులు గమనించాలన్నారు. స్క్రీనింగ్ పరీక్షలో పాల్గొనే 328 మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపామన్నారు. ఆన్‌లైన్ విధానంలోనే పరీక్ష జరుగుతుందని తెలిపారు.

### బాలికపై అత్యాచారం

రాజోలు: పొన్నమండ గ్రామంలో బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ నెల ఒకటో తేదీ అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. రాజోలు సీఐ నరేష్ కుమార్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. తల్లిదండ్రులు చనిపోవడంతో బాలిక తన నానమ్మ సంరక్షణలో ఉంటోంది. అయితే నాన్నమ్మ ఇటీవల తన కుమార్తె ఇంటికి వెళ్లింది. దీంతో బాలిక ఇంట్లో ఒంటరిగా ఉందన్న విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన ములపర్తి వినయ్ శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతర బాలిక బిగ్గరగా కేకలు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

# ఉపాధికి రైట్ రైట్



బస్సు నడపడంలో ప్రాక్టికల్ శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్

- ఆర్టీసీలో హెవీ వెహికల్ ట్రైనింగ్
- ఇప్పటివరకూ 208 మందికి డ్రైవింగ్‌లో శిక్షణ
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్కూల్ ఏర్పాటు

ఏపీఎస్ఆర్టీసీ అంటే బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే సంస్థ అని అందరికీ తెలుసు. ఈ సంస్థ పరిధిలో రాష్ట్రంలోని నలుమూలలకు, ఇతర రాష్ట్రాలకు బస్సులు తిరుగుతాయి. దాదాపు అన్ని మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. అయితే ఇదే సంస్థ ద్వారా యువతకు ఉపాధి శిక్షణ ఇస్తున్నారు. డ్రైవింగ్ స్కూళ్లలో భారీ వాహనాలను నడపడంలో మెళకువలు నేర్పుతున్నారు. తద్వారా వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికులను గమ్యస్థానాలకు తీసుకువెళ్లడంతో పాటు, యువతకు డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడంలోనూ ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్ (ఏపీఎస్ఆర్టీసీ) ముందుంటోంది. భారీ వాహనాలను నడపడంలో యువతకు అత్యుత్తమ శిక్షణ ఇస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా 2021లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం బస్ స్టేషన్లలో మూడు డ్రైవింగ్ స్కూళ్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ చేరిన అభ్యర్థులకు 40 రోజుల పాటు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు. ఉత్తమ డ్రైవర్లను తయారు చేయడమే ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ప్రధాన లక్ష్యం.

**12 బ్యాచ్‌లలో శిక్షణ**

రాజమహేంద్రవరం డ్రైవింగ్ స్కూల్లో ఇప్పటి వరకూ 12 బ్యాచ్‌లలో సుమారు 208 మంది హెవీ వెహికల్ డ్రైవర్లుగా శిక్షణ పొందారు. వీరిలో ముగ్గురు యువతులు ఉండగా, వారిలో ఇద్దరు బీటెక్ చదవడం విశేషం. శిక్షణ పొందిన వారిలో 180 మంది డ్రైవర్లుగా రాణిస్తుండగా, వీరిలో 69 మంది ఆర్టీసీలోనే అవుట్ సోర్సింగ్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని డ్రైవింగ్ స్కూల్లో 13వ బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి కలవారు డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించవచ్చు. శిక్షణ అనంతరం అభ్యర్థుల ఖర్చుతో ఆర్టీఓ అధికారులతో మాట్లాడి డ్రైవింగ్ లెసెన్స్ వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



గత బ్యాచ్‌లో శిక్షణ పొందిన డ్రైవర్లు (ఫైల్)



డ్రైవింగ్ నిబంధనలపై తరగతిలో అభ్యర్థులకు బోధన

**శిక్షణ జరిగే తీరు**

- ప్రతి బ్యాచ్‌కు 16 మంది అభ్యర్థులను మాత్రమే తీసుకుంటారు.
- ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ శిక్షణ ఉంటుంది. దీనిలో 9 నుంచి 12 గంటల వరకూ తరగతిలో బోధన జరుగుతుంది. అనంతరం 12 నుంచి సాయంత్రం 5.30 వరకూ రోడ్లపై శిక్షణ ఇస్తారు.
- ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవింగ్‌లో మెళకువలపై తరగతి గదిలో ప్రతి రోజూ మూడు గంటల పాటు బోధన జరుగుతుంది.
- ప్రతి అభ్యర్థికీ అరగంట చొప్పున కేటాయించి హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు.

**అర్హతలు**

- డ్రైవింగ్ శిక్షణ తీసుకునేవారు కనీసం ఏడో తరగతి పూర్తి చేయాలి. వయస్సు 21 ఏళ్లు దాటాలి.
- ఒక ఏడాది లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ ఉండాలి.
- స్త్రీ, పురుషులందరూ శిక్షణకు అర్హులే, కచ్చితంగా యూనిఫాం ధరించాలి



శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

### త్వరలో 13వ బ్యాచ్



రాజమహేంద్రవరం ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్లో త్వరలో 13 బ్యాచ్ శిక్షణ ప్రారంభం కానుంది. ఆసక్తి కలిగిన వారు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలి. మరిన్ని వివరాలకు 99592 25535, 73821 12678 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. శిక్షణ ఫీజుగా రూ.23,600లను జీఎస్టీతో చెల్లించాలి.

– షర్మిల అశోక, డీపీటీఓ, ఏపీఎస్ఆర్టీసీ, రాజమహేంద్రవరం

### ఉత్తమ డ్రైవర్లను తయారు చేస్తాం



అభ్యర్థులకు రోజుకు 250 కిలోమీటర్ల వరకూ బస్సు నడవడంలో శిక్షణ ఇస్తాం. డ్రైవింగ్ నైపుణ్యం, ఇంజిన్, గేర్ల పనితీరు, ఇంధన పొదుపు, అగ్నిప్రమాదాల నుంచి రక్షణ తదితర అంశాలను వివరిస్తున్నాం. ఓర్పు, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, కలిగిన వారు డ్రైవింగ్‌లో రాణిస్తారు. ఉత్తమ డ్రైవర్లను తయారు చేయడమే మాలక్ష్యం.

– వీఎస్ఎల్ రావు, ఇన్‌స్ట్రక్టర్, ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్, రాజమహేంద్రవరం

### శిక్షణ బాగుంది



డ్రైవింగ్ స్కూల్లో 40 రోజుల పాటు శిక్షణ పొందాను. వాహనాన్ని ఎలా నడపాలి, ఆయిల్‌ను ఆదా చేసే విధానంపై పూర్తి అవగాహన కలిగింది. హెవీ వెహికల్ డ్రైవింగ్ నడపడానికి ఎక్కడ శిక్షణ ఇస్తారనే విషయమై గతంలో చాలాచోట్ల విచారణ చేశాను. ఆర్టీసీ ద్వారా ఇస్తున్నారని తెలిసి నేర్చుకున్నాను. డ్రైవింగ్ శిక్షణతో ఆత్మవిశ్వాసం పెరిగింది.

– భూలక్ష్మి, శిక్షణ పొందిన మహిళా డ్రైవర్

### బాధ్యతల స్వీకరణ



మార్కెట్ అండ్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ జయలక్ష్మికి మొక్క అందజేస్తున్న అధికారులు

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మార్కెట్ అండ్ ఆడిట్ రిజిస్ట్రార్‌గా జె.జయలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ –1 ఆర్‌వీ రామారావు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ –2 పీఎస్‌వీఎస్ఎస్ వీరభద్రరావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కాగా.. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఈ ఏడాది సెప్టెంబర్ 18వ తేదీన జిల్లా రిజిస్ట్రార్ల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు జయలక్ష్మి నియమితులయ్యారు. అయితే వ్యక్తిగత కారణంతో అప్పటి నుంచి సెలవులో ఉన్నారు.

### కారు ఢీకొని వ్యక్తి మృతి



నారాయుడు (ఫైల్)

రాజానగరం: మండలంలోని తూర్పుగానుగూడెం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని సీతారామపురానికి చెందిన వ్యవసాయ కూలీ తామర్ల నారాయణరావు అనే నారాయుడు (66) బైకుపై రామస్వామిపేటలోని తన కుమార్తె ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. జాతీయ రహదారిపై రాంగ్ రూటులో తూర్పుగానుగూడెం వద్ద ఉన్న రోడ్డు మలుపు తిరిగే సమయంలో జగ్గంపేట వైపు నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకుతో సహా రోడ్డుపై ఎగిరిపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని కాపాడేందుకు స్థానికులు వెంటనే 108 కి ఫోన్ చేశారు, అయితే ఆ వాహనం రావడం ఆలస్యం కావడంతో మృతి చెందాడు. నారాయుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసును రాజానగరం ఎస్సై మనోహర్ దర్యాప్తు చేస్తున్నారు.



# ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

- పెళ్లయిన మూడు నెలలకే ఘోరం
- భర్త, అత్తమామల వేధింపులే కారణం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పెళ్లయిన మూడు నెలలకే అత్తింటి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. రాజమహేంద్రవరంలో దీపావళి రోజు ఈ సంఘటన జరిగింది. ఈ కేసులో ఆమె భర్త, అత్తమామలను త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. కంబాలచెరువు సమీపంలోని లోలుగు అపార్ట్‌మెంట్‌లో అమలకంటి వెంకట ప్రసాద్ కుటుంబంతో కలిసి ఉంటున్నారు. వృత్తిరీత్యా కాంట్రాక్టర్ అయిన ఆయనకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె ప్రత్యూష (26)ను ఈ ఏడాది ఆగస్టు 22న పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కత్తి నాగసత్య శ్రీనివాసరావు కుమారుడు వంశీరాధాకృష్ణకు ఇచ్చి వివాహం జరిపించారు. అతడు చెన్నైలోని ఓ కంపెనీలో చార్టర్డ్ అక్కౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. పెళ్లయిన తర్వాత రెండు రోజులు భార్యాభర్తలిద్దరూ పాలకొల్లులో ఉన్నారు. తర్వాత రాధాకృష్ణ చెన్నైకి వెళ్లిపోయాడు. అనంతరం ఇరుకుటుంబాలు కలిసి ప్రత్యూషను చెన్నైలో కాపురానికి దిగబెట్టారు. ఏమైందో తెలియదు గానీ వారం తర్వాత ప్రత్యూషను రాధాకృష్ణ రాజమహేంద్రవరం తీసుకొచ్చి అత్తవారింటి వద్ద దింపి వెళ్లిపోయాడు.

**మానసిక వేదన**

వెంకట ప్రసాద్ తన అల్లుడికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ప్రత్యూషను అడగ్గా తనను ఉద్యోగం చేయాలని బలవంతం చేస్తున్నారని, పెళ్లి సమయంలో మీ వాళ్లు ఇస్తానన్న స్థలం అమ్మేసి డబ్బులు తీసుకురా అడుతున్నారని, తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయింది. పెళ్లి సమయంలో రాధాకృష్ణకు రూ.5 లక్షలు, 15 కాసుల బంగారాన్ని ప్రత్యూష తండ్రి కట్నంగా ఇచ్చారు. అయితే తన భర్త మాట్లాడడం మానేయ్యడంతో ప్రత్యూష మానసికంగా కుంగిపోయింది. పెళ్లయిన మూడు నెలలకే తన సంసారం ఇలా కావడంతో ఆవేదన చెందింది. ఈ విషయంపై దీపావళి ముందు రోజు తీవ్రంగా ఏడ్చింది. అనంతరం రాత్రి 11 గంటల సమయంలో తన గదిలోకి వెళ్లి పోయింది. దీపావళి రోజు ఉదయం ఏడు గంటలకు తల్లి నాగమణి గది తుడవడం కోసం వెళ్లి చూడగా చున్నీతో ఫ్యానుకు ఉరి వేసుకున్న స్థితిలో ప్రత్యూష కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తన అంత్యక్రియలను అత్తవారింటి పేరుతో చేయవద్దని, పుట్టింటి పేరుతోనే చేయాలంటూ చనిపోయే ముందు ప్రత్యూష రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన కూతురు మరణానికి భర్త రాధాకృష్ణ, మామ నాగసత్యశ్రీనివాస్, అత్త పద్మప్రియ వేధింపులే కారణమని వెంకట ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేయగా సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్ బాబు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ప్రత్యూష భర్త, అత్తమామలను అరెస్టు చేసి శనివారం కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరు పరచగా రిమాండ్ విధించారు.



# శలపాకలో విషాద ఛాయలు

- పోస్టుమార్టం అనంతరం గ్రామానికి మృతదేహాలు
- అంత్యక్రియలు నిర్వహించిన కుటుంబ సభ్యులు
- కొనసాగుతున్న పోలీస్ పికెటింగ్

కాజులూరు: దారుణ హత్యలతో ఉలిక్కిపడ్డ శలపాక గ్రామం ఆ విషాదం నుంచి ఇంకా తేరుకోలేదు. కుటుంబ కలహాల నేపథ్యంలో చిన్నపేటకు చెందిన పొట్లకాయల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఎదుట ఇంట్లో ఉంటున్న బత్తుల చిన్నయ్య కుటుంబ సభ్యులపై రెండు రోజుల క్రితం దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో బత్తుల చిన్నయ్య (56), అతడి కుమారుడు బత్తుల రమేష్ (28), తమ్ముడు బత్తుల రాజు (49) అక్కడికక్కడే మృతి చెందారు. కాగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శనివారం పోస్టుమార్టం అనంతరం అధికారులు ఆ మృతదేహాలను గ్రామానికి తీసుకువచ్చారు. మృతులు బత్తుల చిన్నయ్య భార్య అనసూయ, బత్తుల రాజు భార్య సాయిలక్ష్మి జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లారు. కుటుంబ సభ్యుల మరణవార్త తెలియగానే వారిద్దరూ శనివారం ఉదయం గ్రామానికి చేరుకున్నారు. మృతదేహాలను కుటుంబ సభ్యులకు తహసీల్దార్ ఎల్.శివకుమార్ అప్పగించారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు, అల్లర్లు జరుగకుండా గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ పికెట్, 144 సెక్షను కొనసాగుతోంది.



మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న తహసీల్దార్ శివకుమార్ తదితరులు

# ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపిక

తొండంగి: రోప్ స్కిప్పింగ్, మల్కంబ్ క్రీడలకు సంబంధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టుకు 25 మంది విద్యార్థులు ఎంపికైనట్టు రావికంపాడు అరిగెల లచ్చన్నదొర జిల్లా పరిషత్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు బీఆర్‌వీ ప్రసాదరావు శనివారం తెలిపారు. పాఠశాల క్రీడా ప్రాంగణంలో పీఈటీలు కోడూరి నరసింహమూర్తి బృందం అండర్ 14, 17 విభాగాల్లో బాలురు, బాలికలను ఎంపిక చేశారన్నారు. వీరందరూ భీమవరంలో ఈ నెల ఏడున జరగనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో పాల్గొంటారన్నారు.

- మల్కంబ్ క్రీడలో అండర్ – 14 బాలికల విభాగంలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెల్లంక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కర్రి దేవి, కోసెట్టి వీఎన్ దీప్తి, బత్తిన మురారి దివ్య, డి.భారతి ఎంపికయ్యారు. బాలుర విభాగంలో అదే స్కూలుకు చెందిన కోసెట్టి తనూజ్, ఆర్.సూర్య, ఏవీడీఎస్ సంతోష్ కుమార్, గెడ్డం రాహుల్, రంపచోడవరం జీటీడబ్ల్యూఏ హైస్కూల్‌కు చెందిన కోసు శరవన్‌బాబు, చవలం వరుణ్ తేజను ఎంపిక చేశారు. అండర్ – 17 బాలికల విభాగంలో కోనసీమ జిల్లా గురుకులం బాలికల హైస్కూలు విద్యార్థులు బి.గీతిక, జి.ఝాన్సీ, ఎస్.శశికళ, టి.పావని, టి.మన్విత, జగన్నాథగిరి ఏపీఆర్ స్కూలు విద్యార్థి వై.దీప్తి లావణ్య, బి.పరిమిళ, దోసకాయలపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థిని బి.లోకేశ్వరి దుర్గ ఎంపికయ్యారు.
- రోప్ స్కిప్పింగ్‌లో అండర్ – 14 బాలుర గుడిమెల్లంక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కోసెట్టి తనుజ్, ఆర్.సూర్య, రంపచోడవరం జీటీడబ్ల్యూఏ హైస్కూల్‌కు చెందిన సీహెచ్ కల్యాణ్ దొర, సీహెచ్ వరుణ్ తేజ దొర, కె.శర్విన్ బాబు, తుని మండలం ఎస్.అన్నవరం జెడ్పీ హైస్కూలు విద్యార్థి ఎస్.సుజన్, రావికంపాడు హైస్కూలుకు చెందిన ఎం.మౌళి ఎంపికయ్యారు.



రోప్ స్కిప్పింగ్, మల్కంబ్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

### అగ్నిప్రమాదంలో దంపతులకు గాయాలు

మధురపూడి: దుకాణంలో మంటలు రేగడంతో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వారికి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు. కోరుకొండ–శ్రీరంగపట్నం గ్రామాల మధ్యలో గల కనకదుర్గమ్మ ఆలయం పక్కనే ఉయ్యూరి వెంకటరమణ, సత్యవతి దంపతులు దుకాణం నిర్వహిస్తున్నారు. దీపావళి రోజు షాపులో సత్యవతి చీర కొంగుకు నిప్పంటుకుంది. దీంతో మంటలు వ్యాపించి భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. దుకాణంలోని ఫ్రిజ్, ఇతర వస్తువులు కాలిపోయాయి. తారాజువ్వ షాపులోకి దూసుకురావడంతో మంటలు వ్యాపించి ఉండొచ్చని బాధితురాలు సత్యవతి తెలిపారు.

### వాడపల్లికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం కార్తిక శోభను సంతరించుకుంది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు ఏడు ప్రదక్షిణలు నిర్వహించి మొక్కుబడులు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 50 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నారు. కాగా .. ఆయా సేవల ద్వారా శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సుమారు రూ.38,76,441 ఆదాయం సమకూరింది. దేవదాయ ధర్మదాయ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్య చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్సై ఎస్.రాము ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.